తాళ్లబస్తీ అధ్యక్షుడిగా ప్రభాకర్ గంగపుత్ర



ప్రభాకర్ గంగపుత్రను సన్మానిస్తున్న బస్తీవాసులు

కవాడిగూడ: దోమలగూడ తాళ్ల బస్తీ కమిటీ నూతన అధ్యక్షుడుగా ఎ.ప్రభాకర్ గంగపుత్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బస్తీ నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. బస్తీ కమిటీ పదవీకాలం ముగుస్తుండటంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు బస్తీ కమిటీ సలహాదారులు మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, జి.వెంకటేష్, డి.రాములు, టి.కృష్ణ తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా ఎ.ప్రభాకర్ గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బి.శివరాజ్, ఎం.శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, ఎస్.శంకర్, కార్యదర్శులుగా బి.కుమార్, పి.గంగాధర్, ఎస్ మల్లేష్, బి.కాళిదాసు, కోశాధికారిగా సి.హెచ్.శ్రీనివాస్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా అరవింద్, బి.సురేష్, కృష్ణ, మహేందర్ ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను బస్తీ పెద్దలు ఘనంగా సత్కరించారు.

సత్యసాయిబాబా జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

నల్లకుంట: భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 15 నుంచి 24వ తేదీ వరకు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో బాబా శత జయంతి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని శ్రీసత్యసాయి సేవా సంస్థల(ఎస్ఎస్ఎస్ఎస్) అఖిల భారత అధ్యక్షుడు నిమీష్ పాండ్య తెలిపారు.

తెలంగాణ జీపీ ఉద్యోగుల జేఏసీ ఆవిర్భావం



సమావేశంలో అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ(జీపీ) ఉద్యోగుల సంఘ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ఐదు సంఘాలు(తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం, తెలంగాణ గ్రామపంచాయతీ కారోబర్ల సిబ్బంది యూనియన్, కారోబర్స్ అండ్ బిల్ కలెక్టర్ యూనియన్, తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్, బీఆర్‌టీయూ) అధ్యక్షతన జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా మామిడాల నర్సింహులు, వైస్ చైర్మన్‌గా బింగి గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కె.నాయుడు, కార్యదర్శిగా ఓరుగంటి రఘు, చాతల్ల సదానందం, గూని గంగారాం, కోశాధికారిగా సాదుల శ్రీకాంత్, పిల్లి రవి, ప్రచార కార్యదర్శిగా ఎండి.యాకూబ్ పాషా, సీహెచ్.మల్లాచారి, పి.బాలరాజు తదితరులు ఎన్నికయ్యారు.

పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్: శ్రీఅఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో భూతనాథోపాఖ్యానం, శబరిమల సంపూర్ణ చరిత్ర మాల నియమాల నిష్ఠ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గరికపాటి నరసింహారావు చెప్పిన ప్రవచనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవస్థాపకులు కనపర్తి విఘ్నేష్, తెలు శ్రీనివాస్, మేనేజింగ్ కమిటీ ప్రెసిడెంట్ శంకర్‌వర్మ, శబరిమల గురుత్తి పూజ నిర్వాహకులు అజిత్ కుమార్, శివకుంటి ఉన్ని కృష్ణ, శబరిమల మాజీ మెయిల్ బ్రహ్మశ్రీ శాంతి సుధీర్ నంబూద్రి, మురళి నంబూద్రి, ఆధ్యాత్మిక ప్రసంగీకులు అరవింద సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐపై ప్రభుత్వానికి పారదర్శకత ఉండాలి

హిమాయత్‌నగర్: సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత, అధికారులు జవాబుదారిగా ఉండాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర ప్రవంతి, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. డా.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. కమిటీ రాష్ట్ర నాయకులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, అలీ, ఎస్.దిలీప్ రావ్, గోపీనాథ్ కట్టికోల, చింతల క్రిష్ణ, వై.కార్తీక్ రెడ్డి, బి.లక్ష్మణ్, ఆర్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు వస్తే పరేషాన్

- అసౌకర్యాలతో ఆహ్లాదం కరువు
- ఎడారిగా మారిన సమోసా పార్కు
- అసహనం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ఆ పార్కు పేరు సమోసా పార్కు.. దాన్నే ఫ్రీడమ్ పార్కు అని కూడా పిలుస్తారు.. ఇది కాచిగూడ డివిజన్ రహమత్‌బాగ్‌లో ఉంది. అయితే పార్కు అంటే మొక్కలు, చెట్లతో పచ్చగా ఉంటుంది. ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పార్కు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఎంతో అదృష్టవంతులు అనుకుంటే తప్పులో కాలేసినట్లే.. ఈ పార్కులో పచ్చదనం కరువైంది. పార్కు ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. పార్కులో ఓ అరగంట సమయం ఉండలేని దుస్థితి ఎదురైంది. – కాచిగూడ

జీహెచ్ఎంసీ, ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం కారణంగా పచ్చదనంతో కళకళలాడాల్సిన సమోసా పార్కు అపరిశుభ్రంగా మారింది. వర్షాకాలం ప్రారంభమైనా పార్కులో పచ్చదనం పెంచాలనే ఆలోచన అధికారులకు రాకపోవడం దురదృష్టకరం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విశ్రాంతి కోసం ఉదయం, సాయంత్రం వచ్చే సీనియర్ సిటిజన్స్, మహిళలు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం లేకపోవడంతో వెంటనే ఇంటిదారి పడుతున్నారు. అధికారుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పేరుకుపోయిన చెత్తాచెదారం

మందుబాబులకు అడ్డాగా..

ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉండాల్సిన సమోసా పార్కు వద్ద రహదారి వెంట వెళ్లే పాదచారులు మూత్ర విసర్జన చేస్తూ.. స్థానిక వ్యాపారులు చెత్త వేస్తూ.. అక్కడి ప్రశాంతమైన వాతావరణాన్ని పాడు చేస్తున్నారు. దీంతో పార్కులో కాసింత సమయం గడుపుదామని కుటుంబ సభ్యులతో వచ్చిన వారు దుర్వాసన భరించలేక వెళ్లిపోతున్నారు. రాత్రి వేళలో మందుబాబులు పార్కులోకి ప్రవేశించి మద్యం తాగుతున్నారు. స్థానికులు ఎవరైనా మందు బాబులను కదిలిస్తే గొడవలకు దిగుతున్నారు. ఆరోగ్యం కోసం పార్కుకు వస్తే రోగాలు తీసుకొని వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం వీడని అధికారులు

పార్కులో సౌకర్యాలు కల్పించాలని, మందుబాబులు రాకుండా పార్కుకు గేటు ఏర్పాటు చేసి తాళం వేయాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పార్కులో మౌలిక సౌకర్యాలు, పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.



పార్కు గేటు వద్ద జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు



అపరిశుభ్రంగా పార్కు ప్రాంగణం



పార్కులో దర్శనమిస్తున్న శిలాఫలకాలు

చిన్నారుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లలకు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై కూడా ఉందని చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ స్వామిజీ సర్వేశానంద అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో న్యూ ఎరా జూనియర్ కాలేజ్, సెంట్ అడమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో ఓరియన్‌టేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్వామిజీ సర్వేశానంద మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక సమాజంలో విద్యార్థులు, ప్రాశ్చాత్య సంస్కృతి వైపు అడుగులు వేస్తున్నారని... అందుకే వారిని పుస్తక పఠనం వైపు మళ్లించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ... పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

నేటి పిల్లలు మొబైల్ ఫోన్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మొబైల్ వాడకాన్ని, ఫేస్‌బుక్‌లో పిల్లలు మునగకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది అన్నారు. పిల్లల ఎదుగుదలలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో వి.శారద, స్వామి సంజన తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని సాక్షాత్తు ప్రభుత్వ అధికారులే రాతపూర్వకంగా తెలియజేస్తున్నారని ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ ఆరోపించారు. ఆదివారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం ద్వారా ముషీరాబాద్ నియోజకవర్గంలో చేయూత పథకాన్ని, మహాలక్ష్మి పథకాన్ని, కల్యాణలక్ష్మి తులం బంగారం ఎంత మందికి ఇచ్చారని దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అయితే ఏ ఒక్కటీ ఇంత వరకు అమలు కావడం లేదని ముషీరాబాద్ తహసీల్దార్ లిఖిత పూర్వకంగా తెలియజేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా ఇంత వరకు అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని నిలదీశారు. పథకాల ఆశ చూపి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత శ్యామ్

వీరశైవ లింగాయత్‌ల సంక్షేమానికి కృషి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోల సంగమేశ్వర్ అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సంఘమేశ్వర్‌కు ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ కులస్తులను ఓబీసీలుగా గుర్తించేందుకు కృషి చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కులస్తుల సంక్షేమానికి పాటుపడుతూనే కాంగ్రెస్ పార్టీకి తనవంతు సేవాలందించామన్నారు. సంఘం సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనరిసింహ, ఎంపీ సురేష్ షట్కర్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్, రాచప్ప, సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టి శివ, యువజన సంఘం కార్యదర్శి పట్లోల భరత్, ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, మహిళ అధ్యక్షురాలు అశ్విని, నగర అధ్యక్షుడు శివ షరత్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం

కాచిగూడ: చెప్పల్‌బజార్, ఇందిరానగర్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాజేందర్ పటేల్ గౌడ్, కన్నె రమేష్ యాదవ్, మల్లికార్జున్, జె.వెంకటేష్, శ్రావణ్, సురేష్ యాదవ్, ఎస్.రవియాదవ్, బల్వీర్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రామకృష్ణ, రాజు, సుభాష్ పటేల్, అరవింద్, హజారిబాబు, దీపక్, పంకజ్, లావణ్య, శాంతాబాయి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కాచిగూడ: ప్రమాదవశాత్తు రైల్లోనుంచి పడి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఫతేనగర్, శివశంకర్ కాలనీకి చెందిన బూస కళ్యాణ్‌కుమార్(26) ఈ నెల 11వ తేదీన రేపల్లె వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి బూస సాంబశివరావు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ విజయ డెయిరీ కార్మికుడి మృతి

లాలాపేట: విజయ డెయిరీలో ఈనెల 13న చోటుచేసుకున్న బ్లాస్ట్‌లో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు రవి (50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. శ్రీధర్‌రెడ్డి కాంట్రాక్టర్ కింద కొన్నేళ్లుగా టెక్నీషియన్‌గా విజయ డెయిరీలో బాదాం మిల్క్ తయారీ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణ సమయంలో స్టెరిలైజర్ స్టీమ్ ఎక్కువై ఒక్కసారిగా బ్లాస్టైంది. ఈ ఘటనలో రవితో పాటు మరి కొందరు కార్మికులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన రవిని మెరుగైన చికిత్స కోసం డీఆర్‌డీఏ హాస్పిటల్‌కి అక్కడి నుంచి ఎల్‌బీనగర్ అపోలో హాస్పిటల్‌కు తరలించారు. 9 రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు.

తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలోనే అన్ని వర్గాలను కలుపుకొని బీసీ ఉద్యమం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. కాచిగూడలోని ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోందని, 42శాతం బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు జరిపితే బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో ప్రభుత్వం ఇంత వరకు క్లారిటీ ఇవ్వలేదని, ప్రభుత్వ పెద్దలు ఒక్కోసారి ఒక్కో రకమైన ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఒక్కొక్క పార్టీ ఒక్కోచోట సీటు ఇస్తే అగ్ర కులాలకు చెందిన డబ్బున్న నేతలతో బీసీలు పోటీ పడలేరని ఆయన పేర్కొన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారీ చేయాలని బీసీలందరూ కోరుకుంటున్నారని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న గుజ్జ సత్యం

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

కాచిగూడ: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక, వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన అంజయ్య కుమార్తె దాసరి నిషిత(25) హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆదివారం నిషితకు ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు ధ్రువీకరించారు. కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెట్ల కొమ్మల వ్యర్థాల తొలగింపు

చిక్కడపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి రోడ్లపై వేశారు. ఆ వ్యర్థాలను సకాలంతో తొలగించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెట్లకొమ్మలతో రోడ్డు కుంచించుకుపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న తీరుపై 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు ఆదివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి చెట్ల కొమ్మల వ్యర్థాలను తొలగించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సూచన మేరకు వినయ్‌కుమార్ చెట్ల కొమ్మల తొలగింపు పనులను పర్యవేక్షించారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' దినపత్రిక, కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



విశ్వకర్మలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బండ చంద్రారెడ్డి

లాలాపేట: విశ్వకర్మలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం లాలాపేటలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హైదరాబాద్ నగరం నుంచి శ్రీశైలం వరకు నిర్వహించతలపెట్టిన చైతన్య యాత్ర విశ్వకర్మ యువ యాత్ర బైక్ ర్యాలీని చంద్రారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను తీర్చడంలో విశ్వకర్మల సేవలు అభినందనీయం అన్నారు. పుష్పగిరి విశ్వనాథ్, చొల్లేటి ప్రభాకరచారి, కూరెల్లి శివరాం, జలాల్పూరం సదానందచారి ఆధ్వర్యంలో లాలాపేట నుంచి ఈ యాత్రలో దాదాపు 500 మంది పాల్గొన్నారు.

ఆలయ భూమిని కాపాడాలని వినతి

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని కలియుగ ప్రత్యక్ష దైవమైన ప్రసిద్ధ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గొర్ల చంద్రశేఖర్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత పాత శివకుమార్(జగన్) కోరారు. ఈ మేరకు ఆదివారం చిక్కడపల్లి పోలీస్ ఏసీపీ, స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేవాదాయశాఖ మంత్రితోపాటు ముఖ్య కార్యదర్శి ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ ఓఏ (ఒరిజనల్ సూట్) వేయాలని సూచించినా దేవాలయ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: అహర్నిశలూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, అర్ధరాత్రి పిలిచినా పలుకుతానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఆలిండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 29వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం గోల్కొండ చౌరస్తాలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రైస్తవులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా తనవంతుగా కృషి చేస్తారన్నారు. ఏఐసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గిడియన్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ... సంస్థ ఆధ్వర్యంలో క్రైస్తవ సమాజం అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. సంస్థ పక్షాన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డేవిడ్ కడారి, ఆర్చ్ బిషప్ ఎమ్మెస్ కడారి, ఏఐసీఎఫ్ అంతర్జాతీయ ప్రతినిధి కల్యాణి చొప్పల (కువైట్), జయశ్రీ టైటిల్, గ్రేస్ నిర్మల, నిత్య సుజాత, సారా అరుణోదయ, ఆనంద్‌కుమార్, శ్యామ్యూల్‌జాన్, ఆరోస్, డాక్టర్ ఆరోస్ మేడా, బీఆర్ఎస్ నేత రావులపాటి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ముఠాగోపాల్, గిడియన్‌బాబు

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న చంద్రన్న ప్రసాద్

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో 28వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ కోశాధికారి చంద్రన్న ప్రసాద్ తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జేఏసీ నాయకులు గోధుమల కుమారస్వామి, కుసుమ సిద్ధారెడ్డి, సురుదు ప్రభాకర్, ఓవిరాల సుజ్జి, బట్టారి ఆంజనేయ స్వామి, మోహన్ బైరాగి, వేముల యాదగిరి, గడ్డం సదానందం, సర్గ మల్లయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

హిమాయత్‌నగర్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ అన్నారు. దిగంబర్ జైన్ సోషల్ గ్రూప్ హైదరాబాద్ అధ్యక్షుడు వినయ్ గంగవాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీపీఆర్ ట్రైనింగ్ అండ్ బేసిక్ లైఫ్ సపోర్ట్, దిల్ కీ బాత్ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యశోద హాస్పిటల్స్ డాక్టర్ కల జితేందర్ మాట్లాడుతూ గుండెను ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్ జి.రామన్‌గౌడ్, పడాల శ్రీనివాస్‌గౌడ్, జె.కృష్ణగౌడ్, కే.శేఖర్, సుజాత, హితేష్, దిగంబర్ జైన్, సోషల్ గ్రూప్ హైదరాబాద్ సభ్యులు దినేష్ జైన్, సంగీత జైన్, ప్రవీణ్ పాండ్యా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మహాలక్ష్మి